క్లుప్తంగా

మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ రాజకీయ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక పాత బస్టాండ్ నుంచి మున్సిపల్ ఆఫీస్ వరకు ర్యాలీని ర్వహించారు. మున్సిపల్ ఆఫీస్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు. మున్సిపాలిటీ ఎన్నికల సమస్యను ప్రభుత్వం పట్టించుకోవాలని, వెంటనే ఎన్నికలు జరిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కన్వీనర్ అందుగుల శ్రీనివాస్, నాయకులు రవీందర్, సంపత్, అబ్బాస్, తిరుపతిరెడ్డి, రాజశేఖర్, రాజేంద్రప్రసాద్, మాయ రమేష్, మద్ది శంకర్ తదితరులు ఉన్నారు.

మహిళ నేత్రదానం



కృష్ణవేణి (ఫైల్)

బెల్లంపల్లి: అనారోగ్యంతో మృతిచెందిన మహిళ కళ్లను కుటుంబ సభ్యులు దానం చేసి మరో ఇద్దరికి చూపు ప్రసాదించడానికి తోడ్పడ్డారు. బెల్లంపల్లి పట్టణంలోని హన్మాన్ బస్తీకి చెందిన డోలి కృష్ణవేణి (43) సోమవారం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని బసవ తారకం క్యాన్సర్ ఆసుపత్రిలో మృతిచెందింది. ఆమె భర్త డోలి సుధీర్ తన భార్య కళ్లదానానికి అంగీకరించా డు. దీంతో వాసన్ ఐ బ్యాంక్ నిర్వాహకుడు కిరణ్ తన బృందంతో కృష్ణవేణి భౌతిక కాయం నుంచి రెండు కళ్లను సేకరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

పాతమంచిర్యాల: రజక వృత్తిదారుల నూతన క్యాలెండర్‌ను సోమవారం జిల్లా సమీకృత కార్యాలయంలో కలెక్టర్ కుమార్‌దీపక్, వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పాయిరాల రాములు, ఉపాధ్యక్షుడు చందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ హన్మంతు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్(యూఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో మహనీయుల చిత్రపటాలతో ముద్రించిన 2025నూతన సంవత్సర క్యాలెండర్‌ను సోమవారం కలెక్టర్ కుమార్‌దీపక్, డీసీపీ భాస్కర్, డీఈవో యాదయ్యలు వేర్వేరుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, నాయకులు అంజన్న, వికాస్, అభిజిత్, సూరజ్ ,కిరణ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

బెల్లంపల్లిరూరల్: సంగారెడ్డి పట్టణంలో ఈ నెల 25నుంచి 28తేదీ వరకు నిర్వహించే సీపీఎం పార్టీ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం బెల్లంపల్లి ఏరియా కార్యదర్శి గోమాస అశోక్ అన్నారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాలలో సోమవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను మానుకోవాలని డిమాండ్ చేశారు. మహాసభల్లో ప్రజాసమస్యల కార్యచరణపై చర్చించనున్నట్లు తెలిపారు. మహాసభలకు పార్టీ శ్రేణులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఎం పార్టీ నాయకులు చల్లూరి దేవదాస్, లక్ష్మణ్, తిరుపతి, శ్రీకాంత్, శ్రీనివాస్, కిషన్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి స్పందన కరువు



పాల్గొన్న అధికారులు

భీమారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన కరువైంది. ఎంపీడీవో మధుసూధన్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలే ప్రత్యేక ఎజెండాగా ప్రవేశపెట్టిన ప్రజావాణిని ప్రజలు అనుకున్న స్థాయిలో వినియోగించుకోవడం లేదని పేర్కొన్నారు.

ఆహ్లాదం కరువు..!



చెన్నూర్ పెద్ద చెరువుపై నిర్మించిన ట్యాంక్‌బండ్ పై పెరిగిన పిచ్చిమొక్కలు



పూర్తి కాని కుమ్మరికుంట ట్యాంక్‌బండ్



కుమ్మరికుంట ట్యాంక్‌బండ్ పై మద్యం బాటిళ్లు

- ట్యాంక్‌బండ్‌లపై నిర్వహణ లోపం
- పిచ్చి మొక్కలు పెరిగి, మందుబాబులకు అడ్డాగా మారుతున్న వైనం
- పట్టించుకోని అధికారులు

చెన్నూర్: ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలనే ఉద్దేశంతో మున్సిపాలిటీ పరిధిలో రెండు ట్యాంక్‌బండ్‌ల నిర్మాణాలు చేపట్టారు. కానీ వాటిని పట్టించుకోకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి. మరికొందరేమో అక్కడే బహిర్భూమికి వెళ్తుండడంతో వాకింగ్ వెళ్లే వారు, ప్రజలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. నిర్వహణ లోపం కారణంగా ట్యాంక్‌బండ్‌లపై పిచ్చి మొక్కలు మొలిచి అస్తవ్యస్తంగా మారి నిరుపయోగంగా మారుతున్నాయి. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని, ట్యాంక్‌బండ్‌లపై ప్రత్యేక దృష్టి సారించి ఆహ్లాదం కలిగేలా మొక్కలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.15కోట్ల నిధులతో..

చెన్నూర్ మున్సిపాలిటీ సుందరీకరణలో భాగంగా గత ప్రభుత్వం హయంలో పెద్ద చెరువు, కుమ్మరికుంట చెరువులను రూ.15కోట్ల నిధులతో అభివృద్ధి చేపట్టారు. పెద్ద చెరువు ట్యాంక్ బండ్ నిర్మాణానికి రూ.9కోట్లు, కుమ్మరికుంట ట్యాంక్ బండ్‌కు రూ.6కోట్ల నిధులు కేటాయించారు. పెద్ద చెరువుపై నిర్మించిన ట్యాంక్‌బండ్ పూర్తయ్యింది. ఇరుపక్కలా పూలచెట్లు, వాకింగ్ ట్రాక్ నిర్మించారు. కుమ్మరికుంట చెరువుపై పనులు పూర్తి కాలేదు. చెరువు కట్టలపై వాకింగ్ ట్రాక్, ఇరువైపులా పూల మొక్కలు నాటి అసంపూర్తిగా వదిలిపెట్టారు. పూల మొక్కలు నీరు లేక ఎండిపోతుంగా, పిచ్చి మొక్కలు మొలిచి ట్యాంక్‌బండ్‌లు అస్తవ్యస్తంగా మారాయి. ట్యాంక్ బండ్ ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాల్సిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పరిశుభ్రంగా ఉంచాలి



భారీ నిధులతో ట్యాంక్‌బండ్‌లు నిర్మించినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో అపరిశుభ్రంగా మారాయి. వాకింగ్ చేస్తుంటే కంపు వాసన వెదజల్లుతోంది. స్వచ్ఛమైన గాలి వస్తుందని వాకింగ్ చేస్తుంటే, దుర్వాసనకు ముక్కు మూసుకొని వాకింగ్ చేయాల్సి వస్తుంది. ట్యాంక్‌బండ్‌లు పరిశుభ్రంగా ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

– తిరుపతిరెడ్డి, రిటైర్డ్ హెచ్ఎం, చెన్నూర్

బాటిళ్లు పగులగొట్టి చెరువులో వేస్తుండ్లు..



ఉదయం, సాయంత్రం వేళల్లో చాలామంది వాకింగ్‌కు వస్తుండ్లు. మద్యం తాగిన కొందరు మద్యం బాటిళ్లు పగులగొట్టి చెరువులో వేస్తుండ్లు. చెరువు కట్టపై గాజు ముక్కలు పడి కొందరు గాయాల పాలవుతున్నారు. కొందరు యువకులకు చెప్పినా పట్టించుకుంట లేరు. అధికారులు స్పందించి ట్యాంక్‌బండ్‌పై మద్యం సేవించకుండా చర్యలు తీసుకోవాలి.

– సమ్మయ్య, రైతు

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



పాటలు పాడుతున్న కళాకారులు, పక్కన అధికారులు

బెల్లంపల్లి: రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకొని జిల్లా రవాణా శాఖ అధికారి ఆదేశాల మేరకు బెల్లంపల్లిలో రోడ్డు భద్రతపై సోమవారం కళాకారులు ప్రచారం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చౌరస్తా, పాతబస్టాండ్ చౌరస్తా వద్ద ఆటో డ్రైవర్లు, మోటారు క్యాబ్ డ్రైవర్లు, యజమానులకు, పురప్రజలకు రోడ్డు భద్రత నియమాలను తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు పాటల రూపంలో వివరించి చైతన్య పర్చారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించి ప్రమాదాలను నివారించాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్‌స్పెక్టర్లు షేక్ కాశీం సాహెబ్, కె.సూర్యతేజ, సిబ్బంది వేణు, నాగరాజు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఆటో, ఇతర వాహనాల డ్రైవర్లు, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

నస్పూర్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ట్రాఫిక్ ఏసీపీ నరసింహులు అన్నారు. స్థానిక సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా సోమవారం రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, మితిమీరిన వేగం, హెల్మెట్ ధరించకపోవడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. అనంతరం ట్రాఫిక్ నియమాలు పాటిస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, హెచ్ఓడీ నారాయణ మూర్తి, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

నస్పూర్: ప్రతీ వాహనదారుడు వాహనం నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శ్రీరాంపూర్ పోలీసులు శ్రీరాంపూర్‌లోని ఐటీఐ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీ, ట్రాఫిక్ రూల్స్‌పై సోమవారం అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన విధంగా పెండింగ్ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని అఖిల పక్షం నాయకులు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవనంలో సోమవారం అఖిల పక్షం నాయకులు సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రణాళికల్లో ఇచ్చిన విధంగా ప్రాణహిత, కుప్టిల నిర్మాణం, శ్రీరాంసాగర్ ఉత్తర కాలువ నిర్మాణం చేపట్టి, చెన్నూర్ వరకు సాగునీరు అందించాలన్నారు. ఉమ్మడి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలనే డిమాండ్‌తో ఫిబ్రవరి 2న జిల్లా కేంద్రంలో తూర్పు జిల్లాల సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేన శంకర్, తెలంగాణ జలసాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నైనాల గోవర్ధన్, సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు దేవరాజు, జయరావు, జైపాల్‌సింగ్ దేవన్న, మనోహర్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

నస్పూర్: జిల్లాలోని ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్, హాస్టళ్లలో విధులు నిర్వర్తిస్తున్న ఔట్ సోర్సింగ్ వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని భారత కార్మిక సంఘాల(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బ్రహ్మానందం డిమాండ్ చేశారు. హాస్టల్ వర్కర్లతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ వాచ్‌మెన్, కుక్, నైట్ వాచ్‌మెన్, స్లీపర్ అండర్ స్కావెంజర్ వర్కర్లకు ఏడు నెలలుగా వేతనాలు చెల్లించలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అరుణ, అరుణోదయ సాంస్కృతిక శాఖ సమాఖ్య రాష్ట్ర కోశాధికారి మల్లన్న, వర్కర్స్ పాల్గొన్నారు.

● నియామకం

దండేపల్లి: మాలమహానాడు దండేపల్లి మండల యువజన అధ్యక్షుడిగా అరవింద్, జిల్లా ప్రచార కార్యదర్శిగా నర్సయ్య నియమితులయ్యారు. ఈ మేరకు వారిద్దరికి జిల్లా నాయకులు సోమవారం నియామక పత్రాలు అందించారు.

● కుక్కల దాడిలో పలువురికి గాయాలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఆర్‌కే1 సుభాష్‌నగర్‌లో సోమవారం కుక్కల దాడిలో పలువురు గాయపడ్డారు. ఆయా పనుల నిమిత్తం వెళ్తున్న సుమారు ఐదుగురిపై కుక్కలు ఒక్కసారిగా దాడిచేసి గాయపర్చాయని బాధితులు వాపోయారు. కుక్కల నియంత్రణకు సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

● అంత్యోదయ కార్డులు అర్హులకే చెందాలి

మందమర్రిరూరల్: మండల పరిధిలో అంత్యోదయ కార్డులు అర్హులకే చెందాలని అనర్హులను గుర్తించి తొలగించాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు సంపత్, ఆ పార్టీ పట్టణ అధ్యక్షురాలు జయ, రాజు, శ్రీనివాస్, రాజేష్, సుకన్య, భాగ్యలక్ష్మి, కళావతి తదితరులు ఉన్నారు.

● ఫ్లెక్సీలు తొలగించండి

మందమర్రిరూరల్: మున్సిపాలిటీ పరిధిలో అనుమతులు లేకుండా ఇష్టారీతిగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారని బీఆర్ఎస్ నాయకులు సోమవారం స్థానిక మున్సిపల్ ఆఫీస్ ఎదుట ఆందోళన చేపట్టారు. ఫ్లెక్సీలు తొలగించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందించారు.

● పసుల రామ్మూర్తిపై ఫిర్యాదు

కాసిపేట: మండలంలోని దేవాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం మండల ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు లచ్చయ్య, నాయకుడు అట్కపురం రమేశ్ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పసుల రామ్మూర్తిపై కేసునమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

● సన్మానం

కోటపల్లి: మండలంలోని దేవులవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన జీవశాస్త్ర ఉపాధ్యాయురాలు నూగురి అర్చన నేషనల్ మిషన్ ఆన్ మానిటరింగ్ సభ్యురాలిగా ఎన్నికైనందునా సోమవారం పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు అర్చనను సన్మానించారు.

సమాచారం

రేపు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ రాక

నస్పూర్: జిల్లాలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో, జర్నలిస్టు సెమినార్‌లో పాల్గొనేందుకు బుధవారం జిల్లాకు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి రానున్నట్లు డీపీఆర్‌వో శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.45 గంటలకు స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో, మధ్యాహ్నం 3గంటలకు జర్నలిస్టు సెమినార్‌లో ఆయన పాల్గొంటారని పేర్కొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలటౌన్: జిల్లాలో ఉత్తీర్ణులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే నెల 15వ తేదీ నుంచి 4నెలల ఉచిత శిక్షణను ప్రారంభించనున్నట్లు, అభ్యర్థులకు బుక్‌ఫండ్, ప్రతి నెల స్టైఫండ్ ఇస్తారని, గ్రామీణ విద్యార్థుల వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ.2 లక్షల ఆదాయం ఉండాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 20నుంచి ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఆన్‌లైన్లో www.tgbcstudycircle.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, వచ్చే నెల 12నుంచి 14వ తేదీ వరకు ధృవపత్రాల పరిశీలన ఉంటుందని, ఇతర వివరాలకు 08732-221280 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

నేడు, రేపు గ్రామసభలు

భీమారం: ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు 21, 22 తేదీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సదానందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న ఆరెపల్లి, పోలంపల్లి(సదానందం-తహసీల్దార్), ధర్మారం, దాంపూర్, (మధుసూదన్, ఎంపీడీవో)కాజిపల్లి, నర్సింగాపూర్(సతీష్‌రెడ్డి, ఎంపీవో), కొత్తపల్లి, ఎలకేశ్వరం(సుధాకర్, ఏవో), మద్దికల్(స్రవంతి) బూర్గుపల్లి(అరుణ్‌కుమార్), 22న భీమారంలో అన్ని శాఖల అధికారుల సమక్షంలో గ్రామసభలు జరుగుతాయన్నారు.

జన్నారం: ఈ నెల 21, 22తేదీల్లో కొత్త రేషన్ కార్డులు, రైతుభరోసా గ్రామ సభలను నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 21న దేవునిగూడ, కొత్తపేట, కామన్‌పల్లి, కవ్వాల్, రాంపూర్, తిమ్మాపూర్, మహ్మదాబాద్, బాదంపల్లి, చింతలపల్లి, మల్యాల, సింగరాయిపేట, చింతగూడ, లింగయ్యపల్లి, కలమడుగు, మురిమడుగు, తొమ్మిదిగుడిసెల పల్లి, లోతొర్రె, తపాలపూర్, వెంకటపూర్ గ్రామాల్లో 22న పొనకల్, జన్నారం, రేండ్లగూడ, కిష్టాపూర్, ఇందన్‌పల్లి, ధర్మారం గ్రామాల్లో గ్రామ సభలుంటాయని తెలిపారు.

22నుంచి 24వరకు వార్డు సభలు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలోని 36 వార్డుల్లో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు వార్డు సభలను వార్డుల వారీగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్‌కార్డులు, రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను వార్డు సభలో గుర్తించనున్నట్లు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నిధుల మంజూరు కోసం ఎంపీకి వినతి



ఎంపీ వంశీకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల మంజూరు కోసం ఎంపీ ల్యాడ్స్ నుంచి నిధులు మంజూరు చేయాలని కాంగ్రెస్ శ్రేణులు కోరారు. సోమవారం భీమిని మండలానికి వెళ్తున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ బెల్లంపల్లి ఏఎంసీ ఏరియాలో ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఎంపీని మర్యాద పూర్వకంగా కలిసి కండువా కప్పారు. మున్సిపాలిటీలోని 34వార్డుల్లో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

భీమిని: ఇటీవల అనారోగ్యంతో మరణించిన కాంగ్రెస్ నాయకుల కుటుంబాలను పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ సోమవారం పరామర్శించారు. కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ ముసిపట్ల సత్తయ్య, భీమిని మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ దారిశెట్టి వెంకన్నలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మాదవరపు నర్సింగరావుతో కలిసి బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఎస్సీ వర్గీకరణ చేయాలని డప్పులతో ర్యాలీ



ర్యాలీ తీస్తున్న శ్రేణులు

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం బెల్లంపల్లిలో మాదిగ హక్కుల దండోరా (ఎంహెచ్‌డీ) ఆధ్వర్యంలో డప్పులతో ర్యాలీ చేశారు. సింగరేణి కాలరీస్ కంపెనీకి చెందిన బాలగంగాధర్ తిలక్ స్టేడియం వద్ద నుంచి ర్యాలీని ప్రారంభించి పాత బస్టాండ్ చౌరస్తా, బజారు ఏరియా మీదుగా బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్ చౌరస్తా వరకు నిర్వహించారు. ప్రదర్శనలో డప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం బేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ కోసం ఏళ్ల తరబడిగా పోరాటాలు సాగుతున్నాయని, పలువురు అమరులయ్యారని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను అమలు చేయడానికి ముందుకు రావాలని కోరారు. వర్గీకరణను చట్టబద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీ.హెచ్.రాజనర్సు, రాష్ట్ర కార్యదర్శి అరికిల్ల.దుర్గయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శి ప్రసాద్, బెల్లంపల్లి పట్టణ అధ్యక్షుడు ఎనగందుల శివాజీ, అధికార ప్రతినిధి కుశ్నపల్లి రాజలింగు, నాయకులు నవీన్, శేఖర్, రమేష్, లింగంపల్లి రాములు, అనిల్, శంకర్, కుశ్నపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు

నస్పూర్: బెల్లంపల్లి ఏరియా వంద పడకల ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు, ఈఎస్ఐ, ఈపీఎఫ్‌ను చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్న ఎస్ఎస్‌వీ క్రియేషన్స్ ఏజెన్సీ కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఈపీఎఫ్, ఈఎస్ఐ ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఖాళీ ప్లేట్లతో కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సోమవారం బైటాయించి ఆందోళ నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రంజిత్ కుమార్, సంకె రవి మాట్లాడుతూ.. ఉద్యోగులకు ఏజెన్సీ కాంట్రాక్టర్ గత 11నెలలు ఈపీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు జమ చేయడం లేదని, ఐదు నెలలుగా జీతాలు చెల్లించకుండా ఉద్యోగులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు యూనిఫామ్స్, ఐడీ కార్డులు ఇంతవరకు ఇవ్వడంలేదన్నారు. ఇదే విషయమై గతంలో పలుమార్లు ఆసుపత్రి సూపరింటెండెంట్, ఏజెన్సీ సూపర్‌వైజర్, మంచిర్యాల డీసీహెచ్‌ల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా వారు పట్టించుకోలేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి అవుట్ సోర్సింగ్ వర్కర్స్ రమేష్, శ్రీకాంత్, శేఖర్, అన్వర్, అవినాష్, దీప మల్లీశ్వరి, లక్ష్మి, సృజన తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలో విధులు నిర్వర్తిస్తున్న ఎస్ అండ్ పీసీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఏరియాలోని సింగరేణి హైస్కూల్‌లో సిబ్బందిని సోమవారం కలిసి సమస్యలు తెలుసుకున్నారు.

సింగరేణి బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ కార్యవర్గం



ఎన్నికైన సభ్యులతో అసోసియేషన్ నాయకులు

నస్పూర్: సింగరేణి బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ శ్రీరాంపూర్ ఏరియా నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. సీసీసీలోని సింగరేణి ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం రాత్రి జరిగిన సింగరేణి బీసీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ మొదటి మహాసభలో రాష్ట్ర అధ్యక్షుడు ఏ.నాగేశ్వర్‌రావు, చీఫ్ అడ్వైజర్ చిలక శ్రీనివాస్, పి.హరిశంకర్ రావుల ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏరియా ఉపాధ్యక్షులుగా జి. శ్రీనివాస్(ఐటీ మేనేజర్), ఏరియా కార్యదర్శులుగా బరపటి మారుతి, బద్రి బుచ్చయ్య, సహాయ కార్యదర్శులుగా బి.రణదీప్‌గౌడ్, రాచర్ల చంద్రమోహన్, జాయింట్ సెక్రటరీలుగా కొత్తపల్లి రవీందర్, ఎం. రాజేశ్, గొల్ల మహేందర్, కొట్టె శ్రీకాంత్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా మద్రి కొమురయ్య, గొర్ల సంతోష్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా వంగళ కుమారస్వామి, ఎం.రఘురామ్, నీలి సంతోష్, పలువురు ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్‌గా ఎన్నికయ్యారు.

దుండగులను శిక్షించాలని నిరసనలు



చెన్నూర్: నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయులు



బెల్లంపల్లి: నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

బెల్లంపల్లి/తాండూర్/చెన్నూర్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలంలోని తుక్కుగూడ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కంబలి రాములుపై దాడి చేసిన దుండగులను వెంటనే శిక్షించాలని ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. రాములు పై దాడికి నిరసనగా చెన్నూర్ జిల్లా పరిషత్ బాల, బాలికల ఉన్నత పాఠశాల, తాండూర్ మండల తంగళ్లపల్లి పాఠశాల ఉపాధ్యాయులు సోమవారం నల్లాబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఉపాధ్యాయులపై దాడి సమాజానికి మంచిది కాదన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బెల్లంపల్లిలోని రడగంబాల బస్తీ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట సోమవారం ఉపాధ్యాయ సంఘాల జేఏసీ పిలుపు మేరకు నిరసన తెలిపి నినాదాలు చేశారు.

గ్రామ సభలు నిర్వహించాలి

లక్సెట్టిపేట: ఈ నెల 21 నుంచి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి సంజీవ రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.